## క్లుప్తంగా

### గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ



బాలుర గురుకుల పాఠశాలలో వంటశాలను తనిఖీ చేస్తున్న డీఈఓ ఎస్ అబ్రహం

**చింతలపూడి:** జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ అబ్రహం ఆదివారం సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, వంట శాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు తరగతులు ఎలా నిర్వహిస్తున్నారు, పాఠాలు ఎలా బోధిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున విద్యార్థులు జ్వరాల బారిన పడకుండా తగు చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ –2 కిరణ్‌బాబు, గురుకుల పాఠశాల నిర్వాహకులు ఉన్నారు.

### నవరాత్రులకు చలువ పందిళ్లు సిద్ధం



కొయ్యలగూడెం శ్రీరామ్ నగర్‌లో గణపతి ఉత్సవాలకు మందిరం సిద్ధం చేస్తున్న బాలలు

**కొయ్యలగూడెం:** గణపతి నవరాత్రి ఉత్సవాలు అంటేనే ఆబాల గోపాలానికి పరవశం, అందునా బాలలకి మరింత ఆనందం. ఈనెల 7వ తేదీన వినాయక చవితి సందర్భంగా వీధి వీధినా గణపతి ఉత్సవాల నిర్వహణకు బాలలు చలువ పందిళ్లతో మందిరాలను సిద్ధం చేస్తున్నారు. ఇంటింటికి వెళ్లి విరాళాలను సేకరిస్తున్నారు. శ్రీరామ్ నగర్, వాటర్ ట్యాంక్ రామాలయం దగ్గర, ఇతర ప్రాంతాల్లో ఉత్సవ శిబిరాల నిర్మాణం చేస్తున్నారు. కొయ్యలగూడెం టౌన్‌లో గణేష్ సెంటర్లోని ప్రధాన ఆలయంతో పాటు పదిహేను చోట్లకు పైగా గణేష్ ఉత్సవాల నిర్వహణ అమలుకు సంబంధిత అధికారులకు దరఖాస్తులు చేసుకున్నారు. వాటిన్నింటినీ పరిశీలించి ఉత్సవాల నిర్వహణకు అనుమతులు మంజూరు చేస్తామని ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపారు.

### నాణ్యమైన విద్యను అందించండి



అపుస్మా జిల్లా జనరల్‌బాడీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్

**చింతలపూడి:** ప్రైవేట్ విద్యా సంస్థల్లో కూడా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందించడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ సూచించారు. స్థానిక ఎం హోటల్‌లో ఆదివారం అపుస్మా జిల్లా జనరల్ బాడీ సమావేశం జి బుల్లబ్బాయి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల నిర్వాహకులు హాజరయ్యారు. అపుస్మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే రోషన్ కుమార్ హామీ ఇచ్చారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎస్ఆర్‌కే ప్రసాద్, కోశాధికారిగా కె రామకృష్ణలను ఎన్నుకున్నారు. జిల్లాలోని పలు పాఠశాలల కరస్పాండెంట్‌లు పాల్గొన్నారు.

### పెరిగిన నిత్యావసర ధరలను తక్షణమే తగ్గించాలి

**ఏలూరు (టూటౌన్):** పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ సమితి ఇచ్చిన దేశ వ్యాప్త పిలుపులో భాగంగా ఆదివారం సీపీఐ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో స్థానిక ఆర్ఆర్‌పేట ఎన్టీఆర్ పార్కు వద్ద ప్రచార ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, బడ్జెట్లో నిధులు కేటాయించాలని, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను తగ్గించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోదీ అధికారం చేపట్టిన 100 రోజుల్లో ఆకాశంలో ఉన్న నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించి సామాన్యునికి అందుబాటులో ఉంచేలా చేస్తానని చెప్పారన్నారు. రాష్ట్రంలో 89.25 లక్షల మంది రేషన్‌కార్డులు కలిగి ఉన్నారని మరో కోటి మంది రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారని దీన్ని బట్టి ప్రజల ఆర్థిక పరిస్థితిని ప్రభుత్వాలు తెలుసుకొని అర్హులకు జనాభా లెక్కలతో సంబంధం లేకుండా రేషన్ కార్డులను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగం అచ్యుత్, ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

# జలదిగ్బంధంలో గిరిజన గ్రామాలు

- నీట మునిగిన ఎడవల్లి, టేకూరు వాగుల వంతెనలు
- పొంగిపొర్లుతున్న పెద్దవాగు మేళ్ల వాగులు



ఎద్దుల వాగు వంతెన వద్ద దేశీయ పడవపై ప్రయాణిస్తున్న గిరిజనులు

**వేలేరుపాడు:** ఒకపక్క ఎడతెరిపిలేని అతి భారీ వర్షాలు, మరోపక్క గోదావరి వాగులు, వంకలు, పొంగిపొర్లుతుండడంతో వేలేరుపాడు మండలంలో జనజీవనం స్తంభించిందిపోయింది. అనేక గ్రామాల్లో రహదారులు పూర్తిగా పాడైపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. శనివారం ఉదయం 8 గంటల నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు 158 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం ఆదివారం రాత్రి 33 అడుగులకు చేరుకోవడంతో దిగువ ప్రాంతంలో ఉన్న పద్దెనిమిది గిరిజన గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మండలంలోని టేకూరు ఎడవల్లి వాగుల వంతెనలు ఆదివారం ఉదయం నీట మునిగాయి. మండలంలోని కోయిదా, కాచారం, కటుకూరు, పేరంటపల్లి, టేకుపల్లి, టేకూరు, ఎడవల్లి, చిట్టంరెడ్డిపాలెం, ఎర్ర తోగు, తాళ్లగుంది, పూసు గొంది, సిద్దారం, మరో ఆరు గ్రామాలకు మండల కేంద్రంతో ఆదివారం సంబంధాలు తెగిపోయాయి. ఎద్దెల వాగు వంతెన వద్ద అధికారులు దేశీయ బోట్‌ను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల ప్రజలు ఈబోట్‌పై వాగు దాటుతున్నారు. పెద్దవాగు ఆనకట్టకు వేసిన రింగు బండ కూడా కొట్టుకుపోయింది. ఫలితంగా వాగు వెంబడి ఉన్న కమ్మరిగూడెం, ఒంటిబండ, రామవరం, ఊట గుంపు సోందే గొల్లగూడెం తదితర గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఆయా గ్రామాలకు పెద్దవాగు ఆటంకంగా మారడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షానికి అనేక ప్రాంతాల్లో రోడ్లు మళ్లీ కొట్టుకుపోయాయి. వేలేరుపాడు నుంచి రుద్రంకోట వెళ్లే రహదారిలో నడిగడ్డల ప్రాంతంలో భారీ గండి పడింది. గత నెలలోనే ఈ రహదారికి మరమ్మతులు చేపట్టారు. అదేవిధంగా టేకూరు వాగు వంతెన కూడా నీట మునిగింది. వసంతవాడ నుంచి రుద్రమ్మకోటకు వెళ్లే రహదారిలో మద్దికట్ల, లచ్చిగూడెం ప్రాంతంలో రహదారికి అనేకచోట్ల గండ్లు పడ్డాయి.



నీట మునిగిన టేకూరు వాగు వంతెన



భారీ వర్షానికి మద్దిగట్ల ప్రాంతంలో కొట్టుకుపోయిన రహదారి



వర్షానికి కొట్టుకుపోయిన వేలేరుపాడు రుద్రమకోట రహదారి

### శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

**ద్వారకాతిరుమల:** శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు ఆదివారం రూ. 1,00,000 విరాళంగా అందజేశారు. విశాఖపట్నం జిల్లా పెద వాల్తేరుకు చెందిన ఎస్.బాల శివరామకృష్ణ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ అధికారులు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

### దోషులను కఠినంగా శిక్షించాలి



జెడ్పీటీసీ రమేష్

**కామవరపుకోట:** కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల బాలికల వసతి గృహం బాత్రూంల్లో రహస్యంగా హిడెన్ కెమెరాలు పెట్టిన దుండగులను వెంటనే కఠినంగా శిక్షించాలని జెడ్పీటీసీ కడిమి రమేష్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గుడ్లవల్లేరు ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ విషయంపై విద్యార్థులు కళాశాల యాజమాన్యానికి ముందుగానే తెలియజేసినప్పటికీ, వారు పట్టించుకోకుండా బాధ్యులపై ఏ విధమైన చర్యలు తీసుకోకుండా గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ ఘటన సమాజం సిగ్గుపడేలా ఉందన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# గోతులమయంగా రాజవరం రోడ్డు



రాజవరం ఆరిపాటి ప్రధాన రహదారి అధ్వానంగా ఉన్న దృశ్యం

**కొయ్యలగూడెం:** ఆరిపాటి నుంచి రాజవరం మీదుగా జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం వెళ్లే ప్రధాన రహదారి అత్యంత అధ్వానంగా మారింది. మెయిన్ రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడడంతో ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొయ్యలగూడెం, గోపాలపురం మండలాల్లోని కొన్ని గ్రామాల నుంచి పుణ్యక్షేత్రాలైన ఐఎస్ జగన్నాథపురం లక్ష్మీ నరసింహస్వామి, గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి, ద్వారకాతిరుమల సన్నిధానాలకు చేరుకోవడానికి ఇదే ప్రధాన మార్గం. ఈ నేపథ్యంలో ఈ రహదారిపై ప్రయాణం అంటేనే ప్రయాణికులు హడలిపోతున్నారు. అత్యవసర వాహనాలు సైతం సకాలంలో గమ్య స్థానాలకు చేరుకోలేకపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎనిమిది కిలోమీటర్ల మేర అధ్వానంగా ఉన్న ఈ రహదారిని ప్రజాప్రతినిధులు అభివృద్ధి చేయాలని కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, ద్వారకాతిరుమల, గోపాలపురం మండలాలకు చెందిన పదిహేను గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### పెరిగిన గోదావరితో ఆందోళన



గుండేటివాగులోకి చొచ్చుకువచ్చిన గోదావరి వరద

**కుక్కునూరు:** గత రెండు రోజులుగా గోదావరి నది పరివాహక ప్రాంతాల ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి వరద స్వల్పంగా పెరిగింది. భద్రాచలం వద్ద ఆదివారం సాయంత్రానికి 31 అడుగులకు చేరుకుంది. కాగా పెరిగిన గోదావరి వరద కుక్కునూరులో గుండేటి వాగులోకి చొచ్చుకువచ్చింది. గోదావరి వరద పెరుగుతుండడం రైతులను కలవరపెడుతోంది. వరద పెరిగితే పంటల పరిస్థితి ఏమవుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### మైసన్నగూడెం శ్మశానవాటిక సమస్య పరిష్కరించండి

**జంగారెడ్డిగూడెం:** మైసన్నగూడెంలోని శ్మశానవాటిక సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామానికి చెందిన పిల్లి పోతురాజు అధ్యక్షతన గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.ఉదయకిరణ్ మాట్లాడుతూ మైసన్నగూడెం, అగ్రహారం గ్రామాలకు శ్మశానవాటిక సమస్యపై పరిశీలించి సర్వే జరిపించాలన్నారు. అలాగే శ్మశానవాటికల్లో మంచినీళ్లు, విద్యుత్, దహన సంస్కారాల నిర్వహణకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అలాగే శ్మశానవాటికకు వెళ్లే ఎస్సీ దళిత పేటల నుంచి వెళ్తున్న ప్రధాన దారిని నిర్మించాలని కోరారు. గ్రామస్తులు పిల్లి సీతారాములు, గారపాటి సాయి, సుబ్బారావు, అర్జున, పవన్, చిన్న బాబు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు

### పేకాట స్థావరంపై దాడి

**ద్వారకాతిరుమల:** మండలంలోని ఎం.నాగులపల్లిలో ఆదివారం ఒక పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో దెందులూరు మండలం పెరుగ్గూడెంకు చెందిన యలమర్తి మాణిక్యాలరావుతో పాటు, మరో 5 గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.12,940 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

# లోతట్టు ప్రాంతాలు జలమయం



కిన్నెరసాని ఉధృతితో సీతారామనగరంలో నీటమునిగిన వరిపంట

**కుక్కునూరు:** అల్పపీడన ప్రభావంతో శనివారం సాయంత్రం నుంచి భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షం దాటికి మండలంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల ఇళ్లలోకి వరద నీరు చేరుకుంది. కుక్కునూరు శివాలయం వీధిలో పిడుగుపాటుకు పలు ఇళ్లలోని ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు కాలిపోయాయి. కాగా పెద్ద శబ్దంతో పిడుగుపడడంతో సమీపంలోని ఇళ్లలోని వారు భయభ్రాంతులకు గురయ్యారు.

**ఉధృతంగా కిన్నెరసాని**

కిన్నెరసాని ప్రాజెక్టుకు రికార్డ్ స్థాయిలో వరద నీరు చేరుకోవడంతో అధికారులు లక్షా నాలుగువేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో కిన్నెరసాని ఉధృతితో మండలంలోని సీతారామనగరం గ్రామానికి వెళ్లే రహదారి మార్జిన్ కోతకు గురైంది. వరిపంట పూర్తిగా వరద నీటి ముంపునకు గురైంది. కాగా కిన్నెరసాని ఉధృతితో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ఎంపీయూపీఎస్ పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ వీవీ పెద్దిరాజు చెప్పారు.



వరద ఉధృతికి కోతకు గురైన సీతారామనగరం రహదారి మార్జిన్

# వినాయక చవితి ఉత్సవ ఏర్పాట్లకు శ్రీకారం

- పందిళ్ల నిర్మాణ పనులు ప్రారంభం
- గ్రామాల్లో మొదలైన సందడి
- ఈనెల 7 నుంచి గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**ద్వారకాతిరుమల:** గ్రామాల్లో వినాయక చవితి సందడి మొదలైంది. ఈనెల 7 నుంచి గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం ఏర్పాట్లను ప్రారంభించారు. అందులో భాగంగా ద్వారకాతిరుమలలోని చెరువు వీధిలో, పసరు కోనేరు ప్రాంతంలో, దేవస్థానం హైస్కూల్ వద్ద మందిరాల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అలాగే తిమ్మాపురం సెంటర్‌లో విద్యుత్ అలంకారాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని మిగిలిన గ్రామాల్లో సైతం ఉత్సవ నిర్వాహకులు ఏర్పాట్లు చురుగ్గా ప్రారంభించారు. ఈ ఉత్సవాలను ఈ సంవత్సరం వైభవంగా నిర్వహించాలని కమిటీ సభ్యులు భావిస్తున్నారు. అందుకు అనుగుణంగా భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీసు వారి సూచనల మేరకు అన్ని అనుమతులు పొందేందుకు సంసిద్ధమౌతున్నారు.

**భారీగా పెరిగిన ధరలు..**

వినాయక విగ్రహాల ధరలు గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది దాదాపు రెట్టింపయ్యాయి. గతంలో 5 అడుగుల విగ్రహాలను రూ. 8 వేల నుంచి రూ.10 వేల వరకు విక్రయించేవారు. అదే సైజు విగ్రహాలు ప్రస్తుతం రూ. 15 వేలకు పైగా పలుకుతున్నాయి. 12, 13 అడుగుల విగ్రహాలు డిజైన్లు, ఇతర దేవతా మూర్తుల కాంబినేషన్, రంగులు, హంగులు కలిగి ఉన్న వాటిని రూ.30 నుంచి రూ.50 వేలకు పైగా విక్రయిస్తున్నారు. ఇవి కాకుండా భారీ విగ్రహాలు లక్షల్లో ధర పలుకుతున్నాయి. ఇప్పటికే ఉత్సవ కమిటీల సభ్యులు విగ్రహాలను సెలక్ట్ చేసుకుని, వాటికి అడ్వాన్స్‌లు చెల్లించి రిజర్వ్ చేసుకున్నారు.

**ఎంత భారమైనా తగ్గేదేలే..**

ఉత్సవాల నిర్వహణ ఎంత భారమైనా తగ్గేదేలే.. అంటున్నారు కమిటీల సభ్యులు. పెరిగిన ధరలను లెక్కచేయకుండా, అట్టహాసంగా ఈ ఉత్సవాలను జరిపేందుకు కమిటీల సభ్యులు కంకణం కట్టుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో 3 రోజులు, మరి కొన్ని ప్రాంతాల్లో 9 రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు.





జంగారెడ్డిగూడెం: అమ్మకానికి సిద్ధంగా గణేష్ విగ్రహాలు, మూషిక వాహన బొజ్జగణపయ్య

**ముస్తాబైన గణనాథులు**

**జంగారెడ్డిగూడెం:** వినాయక చవితి ఉత్సవాలకు గణనాథుల విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. వివిధ ఆకృతులలో బొజ్జగణపయ్య విగ్రహాలు అందుబాటులోకి వచ్చాయి. ఉత్సవ కమిటీల అభిరుచులకు అనుగుణంగా గణేష్ ప్రతిమలను రూపకర్తలు తయారు చేశారు. ఆయా విగ్రహాల కూర్పు, సైజును బట్టి ధరలను విక్రయదారులు నిర్ణయించారు. ఈ నెల 7వ తేదీ నుంచి గణపతి నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో జంగారెడ్డిగూడెంలో పలు ప్రాంతాల్లో వివిధ ఆకృతుల్లో ఉన్న గణనాథుల విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. మూషిక వాహన బాల గణేశుడు, నంది వాహనంపై గణేషుడు, తలపాగా చుట్టుకున్న గణేషుడు ఇలా అనేక రూపాల్లో వినాయక విగ్రహాలు ఆకట్టుకున్నాయి. విగ్రహం సైజును బట్టి రూ. 1500 నుంచి రూ. 15వేల వరకు విక్రయిస్తున్నారు. కాగా వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా నిర్వాహకులు పకడ్బందీ ఏర్పాట్లు చేసుకోవాలని పోలీసులు తెలిపారు. ముఖ్యంగా నిమజ్జనం సమయంలో అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నందున నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలన్నారు.



ద్వారకాతిరుమలలోని చెరువు వీధిలో మందిర నిర్మాణ పనులు



ద్వారకాతిరుమలలో సిద్ధంగా గణేషుని విగ్రహాలు

### అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

**జంగారెడ్డిగూడెం:** అదనపు కట్నం వేధింపులపై వివాహిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జబీర్ తెలిపారు. బుట్టాయగూడెం మండలం జోడిగోడిగూడెంకు చెందిన పూనెం సింధూర్, దొరమామిడికి చెందిన నవ్య పెద్దల సమక్షంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. వివాహ సమయంలో నవ్య తల్లిదండ్రులు మూడున్నర కాసుల బంగారం ఇచ్చారు. అయితే మద్యానికి బానిసైన సింధూర్ ఇటీవల వేధిస్తుండటంతో నవ్య విషయాన్ని పెద్దల్లో పెట్టింది. అయినప్పటికీ సింధూర్ మారకపోవడంతో ఏడాది క్రితం కుటుంబంతో సహా నవ్య జంగారెడ్డిగూడెంలో నివాసం ఉంటోంది. ఆగస్టు 29న మద్యం సేవించి నవ్య ఇంటికి వచ్చిన సింధూర్ సొమ్ములు ఇస్తావా లేదా అంటూ పిల్లలను వెంట తీసుకువెళ్లుతుండగా, అడ్డుకోబోయిన నవ్యను రాడ్డుతో కొట్టి గాయపర్చాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.

### పంట ధ్వంసం చేసిన ముగ్గురిపై కేసు నమోదు

**జంగారెడ్డిగూడెం:** అక్రమంగా తమ పొలంలోకి ప్రవేశించి పంట ధ్వంసం చేశారంటూ ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జబీర్ తెలిపారు. వివరాల ప్రకారం.. లక్ష్మీజ్యోతికి జంగారెడ్డిగూడెం పరిధిలో ఆర్ఎస్ నెంబర్ 228/27లో భూమి ఉంది. ఈ భూమిలో జామాయిల్ తోట వేశారు. అయితే చిట్టూరి సూరిబాబు, చిట్టూరి సతీష్ సదరు భూమిని ఆక్రమించుకునేందుకు యత్నించగా, ఆమె జంగారెడ్డిగూడెం కోర్టులో పర్మినెంట్ ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నట్లు తెలిపింది. అయితే ఆగస్టు 19వ తేదీన చిట్టూరి సూరిబాబు, చిట్టూరి సతీష్, అట్లూరి శేఖర్ పొలంలోకి అక్రమంగా ప్రవేశించి జేసీబీలతో జామాయిల్ పంట ధ్వంసం చేశారని పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### లారీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

**ఏలూరు టౌన్:** ఏలూరులో ఒక లారీ డ్రైవరు పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని ఆత్మ హత్యాయత్నం చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఏలూరు తంగెళ్లమూడికి చెందిన వేల్పూరి ఉమామహేశ్వరరావు లారీ డ్రైవరుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి వివాహమైంది. కొంతకాలం క్రితం భార్య విడిపోయి వేరే చోట ఉంటోంది. పిల్లలు కూడా ఆమెతోనే ఉంటున్నారు. ఈ క్రమంలో ఉమామహేశ్వరరావు ఆదివారం తంగెళ్లమూడి నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లే రోడ్డులో ఒక చర్చి సమీపంలో పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. దీన్ని గమనించిన స్థానికులు మంటలను అదుపు చేసి 108 అంబులెన్స్‌లో అతన్ని సర్వజన ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్సనందిస్తున్నారు. లారీ డ్రైవర్ ఆత్మ హత్యాయత్నానికి దారి తీసిన పరిస్థితులు తెలియాల్సి ఉంది. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.